## డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు, నాలుగేళ్ల హానర్స్ కోర్సులైన బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్సి ఫిజిక్స్, బిఎస్సి కెమిస్ట్రీ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సి కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. ఈ కోర్సులలో చేరడానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఒఎయండిసి) సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పరిశోధన, అకడమిక్‌లో అపారమైన అనుభవం గల అధ్యాపకులచే ప్రయోగ, పరిశీలనాత్మక విద్యా బోధన ఆధునిక విధానంలో ఉంటుందని పేర్కొన్నారు.

# డేంజర్‌లో ఎంఆర్‌డి!

- జిజిహెచ్ రికార్డులకు నీటిచెమ్మ
- జిజిహెచ్ టాప్ నీటిగొట్టాలు మూసివేత
- ఏళ్ల తరబడి పారిశుధ్య పనులు చేపట్టని వైనం
- అధ్వాన పారిశుధ్యంపై అడ్మినిస్ట్రేటర్, ఆర్ఎంఒ ఆరా

రిమ్స్ ఆస్పత్రి టాప్‌లో భారీగా నిలిచిన వర్షపు నీరు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి డేంజర్‌జోన్‌లో నిలిచింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రి టాప్‌లో భారీగా వర్షపునీరు నిలిచింది. కొన్నేళ్లుగా జిజిహెచ్ టాప్ ముందు భాగంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించని నేపథ్యంలో నీటి సరఫరా ద్వారాలకు కుళ్లిన చెత్తాచెదారంతో మూతబడ్డాయి. ఫలితంగా జిజిహెచ్ టాప్‌లో నిలిచిన వర్షపు నీరు చెలిమను తలపించింది. మెడికల్ రికార్డు డిపార్టుమెంట్ గదిలోనికి నీటి చెమ్మ భారీగా చేరుకుంది. ఫలితంగా వేలాది మెడికల్ రికార్డులను నీటి చెమ్మ గండం ఏర్పడింది. మంగళవారం ఎంఆర్‌డి డిపార్టు మెంట్ నిర్వాహకులు చెమ్మగిల్లిన మెడికల్ రికార్డుల సమాచారాన్ని జిజిహెచ్ ఆర్ఎర్ శ్రీనివాసులకు అందజేశారు. ఆర్ఎర్ జిజిహెచ్ టాప్ ముఖభాగం తాళాలు తెప్పించుకుని తెరిచి భారీగా నిలిచిన నీటి చెలిమను పరిశీలించారు. జిజిహెచ్ డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేషటర్ రంగస్వామికి సమాచారాన్ని అందజేశారు. అడ్మినిస్ట్రేటర్ నీటిచెలెమ తరహా నీటి నిల్వను పరిశీలించి, పారిశుధ్య పనుల ఇన్‌స్పెక్టర్ ఎవరని, ఎక్కడకు వెళ్లాడని, ఏమి పనులు చేస్తున్నారని ఆరాతీశారు. జిజిహెచ్ పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ ఆగమేఘాలపై నీటి చెలెమలోకి దిగి, నీటిసరఫరా ద్వారాల దగ్గర ఆకులు, అలుమలతో కుళ్లిన, భారీగా వర్షపు నీటి తరలింపు రంధ్రపు గొట్టాలకు అడ్డంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. గంటపాటు శ్రమించినప్పటికీ నీటి నిల్వలు తరగని పరిస్థితి నెలకొంది. జిజిహెచ్ అడ్మినిస్ట్రేషన్ ఆవరణలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే మిగిలిన ప్రాంతాల్లో పారిశుధ్యం ఎలా ఉందో అనే సందేహాలు వ్యక్తమవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా జిజిహెచ్ పాలనా యంత్రాంగం పారిశుధ్య పనుల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### శాంతియుత వాతావరణంలో

# వినాయక ఉత్సవాలు

- మట్టి విగ్రహాలనే ఉపయోగించాలి
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

**ప్రజాశక్తి-కడప**

శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. జిల్లాలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా మన జిల్లా ప్రసిద్ధి చెందిందన్నారు. అన్ని మతాల ప్రజల సహకారంతో అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ మట్టివిగ్రహాలనే ఉపయోగించాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మాత్రమే సౌండ్ సిస్టం ఏర్పాటుచేసుకోవాలని ఉత్సవ నిర్వాహకులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో గజ ఈతగాళ్లను, సిద్ధంగా ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవడం అనావతిగా వస్తుందన్నారు. వినాయక చవితి పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అనుమతులకు సంబంధించి పోలీస్ శాఖ ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదన్నారు. సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణలో శాంతి భద్రతల ఏర్పాట్లపై పలువురు శాంతి కమిటీ సభ్యుల అభిప్రాయాలను కలెక్టర్ స్వీకరించారు. సమావేశంలో జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు, ఆర్‌డిఒలు జాన్ ఐర్విన్ చంద్ర మోహన్, సాయి శ్రీ, కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, పోలీసు అధికారులు ,గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు, శాంతి కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిడిఎంఎకు వినతి పత్రం అందజేస్తున్న యునియన్ నాయకులు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) కడప నగర కమిటీ నాయకులు కోరారు. మంగళవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో సిడిఎంఎ డాక్టర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి సుంకర రవి మాట్లాడుతూ ఐదుగురు మున్సిపల్ కార్మికులు చనిపోయి 3,4 సంవత్సరాల అవుతున్నాఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 9 మంది డ్రైవర్లకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అడిషనల్ కోవిడ్ కార్మికులకు కలెక్టర్ ఇచ్చినటువంటి ప్రొసిడింగ్ ప్రకారం ఒకరోజు వేతనం రూ.596 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 124 అమలు చేయాలని కోరారు. సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. పర్మినెంట్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వకుండా చాలా అన్యాయం చేస్తున్నారని వాపోయారు.రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలను మంజూరు చేయాలని కోరారు. రిటైర్మెంట్ వయసు 62 పెంచి బెనిఫిట్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాసాపేట రోడ్డు విస్తరణలో మున్సిపల్ కార్మికులు గృహాలు కోల్పోయారని, వారికి పక్కా గృహాలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు పండగ సెలవులు ప్రకటించాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ అయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాలు త్వరగా ఇవ్వాలని కోరారు. వినతి పత్రంపై స్పందించిన సిడిఎంఎ జీతాలకు సంబంధించిన బిల్లు వెంటనే పంపండి జీతాలు ఇస్తామని పేర్కొన్నారు. సమ్మె కాలపు వేతనం జిఒ ఇవ్వడానికి ఇంకా సమయం పడుతుందని తెలిపారు. మిగతా సమస్యలు తాము అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

## మాజీ సైనికుల కోసం న్యాయ సేవల క్లినిక్ ప్రారంభం

**ప్రజాశక్తి - కడప :** కడప నగరం చెన్నై షాపింగ్‌మాల్ వెనుకనగల 'జిల్లా సైనిక బోర్డు'లో మాజీ సైనికుల కోసం ఏర్పాటు చేసిన న్యాయ సేవల క్లినిక్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మంగళవారం ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సైనికుల కోసం న్యాయ సేవల క్లినిక్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. న్యాయ సంబంధ సమస్యల పరిష్కారం కోసం క్లినిక్లను సందర్శించవచ్చని చెప్పారు. ఈ క్లినిక్‌లో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారా లీగల్ వాలంటరీని ఏర్పాటు చేశారని అని తెలిపారు. వీరు ప్రతి సోమ, శుక్రవారాలలో ఈ క్లినిక్‌లో అందుబాటులో ఉంటూ మాజీ సైనికుల సమస్యలను తెలుసుకుని వారికి తగు సలహాలను ఇస్తారని చెప్పారు. **ఖాళీ పోస్టులకు నేటి నుంచి రాత పరీక్షలు..** జిల్లా వ్యాప్తంగా కోర్టులలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు రాత పరీక్షలు ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడారు. పరీక్షలు కడపలోని శ్రీనివాస, కెఎస్ఆర్ఎం, కెఎల్ఎం, కెఒఆర్ఎం, అన్నమాచార్య, రాయచోటిలో శ్రీ సాయి, భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహిస్తారని చెప్పారు. ప్రొద్దుటూరులో శ్రీ రాజేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలోనూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. పరీక్షలు రోజూ మూడు షిఫ్ట్ లలో నిర్వహిస్తారని తెలిపారు. డ్రైవర్, టైపిస్ట్, కాపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తోపాటు గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలన్నారు.

## శ్మశాన సమస్యను పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కాశినాయన :** మండల పరిధిలోని చెన్నవరం గ్రామానికి చెందిన దూదేకుల శ్మశాన వాటిక సమస్యను అధికారులు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానిక దూదేకుల కులస్థులు పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కత్తెర గండ్ల పంచాయతీ చెన్నవరం గ్రామంలో ఉండే దూదేకుల శ్మశాన వాటికకు1993లో బిజీ వేముల వీరారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు శ్మశాన వాటిక కోసం 4. 19 ఎకరాల స్థలాన్ని అప్పటి కలెక్టర్‌తో మాట్లాడి కేటాయించారన్నారు. అప్పటి నుంచి శ్మశాన ఒవాడుకలోనే ఉందని, ప్రస్తుతం అగ్రకులానికి చెందినవారు ఆక్రమించుకున్నారని వాపోయారు. తాము అడిగితే శ్మశాన స్థలం పది సెంట్లు మాత్రమేనని బుకాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, తహశీల్దార్ పరిశీలించి వెళ్లారే తప్ప పరిష్కర మార్గం చూపలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన స్థలం సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న జెడి చంద్రనాయక్

**ప్రజాశక్తి - కడప సిటీ :** పట్టణంలోని ఎరువుల దుకాణాలను జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి. చంద్రనాయక్ తనిఖీ చేశారు. మంగళవారం ఎరువుల దుకాణదారులు తప్పని సరిగా స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, ఎరువుల ధరల బోర్డు, దుకాణాల ముందు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు, ఎరువుల గ్రౌండ్ బ్యాలెన్స్‌కు ఇ పాస్ మిషన్ బ్యాలెన్‌కు వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. యూరియాను ఎంఆర్‌పి ధరకంటే అధిక ధరకు విక్రయించారని పేర్కొన్నారు. ఎరువుల అమ్మకాలు ఇ పాస్ మిషన్ ద్వారానే విక్ర యించాలని సూచించారు. ఉద్యాన పంటలకు కాంప్లెక్స్ ఎరువులను వేసుకోవాలని తెలిపారు. యూరి యాను వ్యవసాయ పంటలకు(వరి) ఎకరాకు 50 కిలోలు రెండు దఫాలుగా వేసుకోవాలని తెలిపారు. యూరియా ఎక్కడా కొరత లేదని తెలిపారు. ఆయన వెంట ఎఒ ఎస్.వి. సురేష్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవర్ధన్, ఎరువుల డీలర్లు ఉన్నారు.

## జిల్లాలో సిఐల బదిలీ

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** కర్నూలు రేంజ్ పరిధిలోని సిఐలను బదిలీ చేస్తూ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప విఆర్‌లో ఉన్న జి.సుబ్బారావు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎన్. కృష్ణయ్యను బద్వేల్ రూరల్ సర్కిల్‌కు, ఇందులో పనిచేస్తున్న నాగభూషణం సికె దిన్నె పోలీస్ స్టేషన్‌కు, ఇందులో పనచేస్తున్న శివశంకర్ నాయక్‌ను ఎస్ బి -2 కడపకు బదిలీ చేశారు. ఎస్‌బి-లో పనిచేస్తున్న భాస్కర్ రెడ్డిని ఎస్ బి -1 కు, ఎస్ బి-1 లో పనిచేస్తున్న పురుషోత్తమరాజును ఎస్‌సి, ఎస్‌టి సెల్‌కు, ఇందులో పని చేస్తున్న వేణుగోపాల్‌ను ప్రొద్దుటూరు 3 టౌన్‌కు, ఇందులో పనిచేస్తున్న గోవింద్ రెడ్డిని విఆర్ కడపకు బదిలీ చేశారు

### విద్యా రంగ సమస్యలు పరిష్కరించకుంటే

## ఉద్యమిస్తాం : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించుకుంటే ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ నగర నాయకులు హెచ్చరించారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్లకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. కడప నగరంలో తహశీల్దార్ ఎంవిఎస్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కడప నగర కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ చదువు పేరుతో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు దోచుకుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గల్లీకి ఒకటి విద్యాసంస్థలు ఏర్పరచుకుని విద్యార్థుల తల్లిదండ్రులను రక్తం జలగల్లా పీలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల రూపంలో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. విద్యా దీవెన, వసతి దీవెన, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జిఒ నంబర్ 77 ను రద్దు చేసి ప్రయివేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ కల్పించే విధంగా జీవోను రద్దు చేయాలని తెలిపారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తల్లికి వందనం ఎలాంటి షరతులు లేకుండా అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని సంక్షేమ వసతి గృహాలు సొంత భవనాలు ఉన్న కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న, లోకేష్ పాల్గొన్నారు.

## జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా సాయి శివకేశవ

**ప్రజాశక్తి - కడప అర్బన్**

సమాజ సేవా సమితి జిల్లా లీగల్ సెల్ అడ్వయిజర్‌గా కొప్పరపు సాయి శివకేశవను నియమించినట్లు సమాజ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా లీగల్ అడ్వయిజర్‌గా ఎన్నికైన కొప్పరపు సాయి శివకేశవ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పైన అలుపెరగని పోరాటం చేస్తానని పేర్కొన్నారు. సమాజ సేవా సమితి బలోపేతకానికి కృషి చేస్తానని చెప్పారు. తనను కడప జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు వాండ్రాసి పెంచలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫొటో గ్రాఫర్‌కు సన్మానం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యువ ఫొటోగ్రాఫర్ సమీవుల్లాను నగరంలోని మేకల దొడ్డిలో ఉన్న జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా మాట్లాడుతూ ఫొటోగ్రఫీ ఒక కళ నైపుణ్యమని తెలిపారు. యువకులు ఫొటోగ్రఫీ కళను ఎంచుకుని తమ కాళ్లపై నిలబడాలన్నారు. కార్యక్రమంలో సలీం, శివ, మణి పాల్గొన్నారు.

## 24న టిటిసి పరీక్ష

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** టిటిసి థియరీ పరీక్ష ఈనెల 24న నిర్వహించనున్నట్లు డిఇఒ షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 1:00 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, 3.30 నుంచి 4.30 వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. మున్సిపల్ హైస్కూల్ మెయిన్ సెంటర్‌లో పరీక్ష ఉంటుందని తెలిపారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

చక్రాయపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగార్జునరెడ్డి కుటుంబానికి ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందచేశారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ సతీమణి ఎం.జయలక్ష్మికి చెక్కును పంపిణీ చేశారున. హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (పరిపాలన) కె. ప్రకాష్ బాబు, ఎఒ కె.వెంకటరమణ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, ఐసి సభ్యులు ఏఫ్రిన్ పాల్గొన్నారు.

## యూరియా వినియోగంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అక్రమంగా విక్రయించినా, ఇతర అవసరాలకు మళ్లించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్‌లోని తన ఛాంబర్‌లో టెక్నికల్ గ్రేడ్ యూరియా, సబ్సిడీ యూరియాను పరిశ్రమల అవసరాలకు మళ్లిస్తున్నారన్న విషయమై వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యవసాయంతో పాటు యూరియాను వినియోగిస్తున్న పలు పరిశ్రమలను గుర్తించి, వారి అవసరాలకు ఎక్కడి నుంచి యూరియాను కొనుగోలు చేస్తున్నారన్న వివరాలపై ఆరా తీయాలన్నారు. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమల్లో తుది ఉత్పత్తుల కోసం నత్రజని సమ్మేళనాలను ఉపయోగిస్తున్నాయన్న విషయంపై సంబంధిత అధికారులు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేయాలని తెలిపారు. జిల్లాలోని పౌల్ట్రీలు, లిక్కర్, మొలాసిస్, ప్లైవుడ్/రెసిన్ యూనిట్లు, పెయింట్స్/వార్నిష్ ఉత్పత్తుల పరిశ్రమలపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఇప్పటికే 7,186 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని చెప్పారు. ప్రస్తుతం 3,366 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, మరో 4,368 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఇండెంట్ కూడా పంపించామని పేర్కొన్నారు. జిల్లాలో యూరియా, సంబంధిత ఎరువులకు ఎలాంటి కొరత లేదన్నారు. అలాగే.. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే ఎరువులను రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రా నాయక్, ఎపి మార్క్ ఫెడ్ డిఎం పరిమళ జ్యోతి, కార్మిక శాఖ ఉప కమిషనర్ రంగరాజు, పశుసంవర్ధక అధికారి డాక్టర్ అనుపమ, సివిల్ సప్లయ్ అధికారి శిరీషా, డిఎం నాగసుధా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ సుధా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# రోడ్డు అస్తవ్యస్తం.. రాకపోకలు ఇబ్బందికరం

- ఏళ్ల తరబడి గుంతలమయం
- మరమ్మతుకు నోచని వైనం
- రోడ్డు దుస్థితిపై పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వాలు మారినా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు

రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

**ప్రజాశక్తి-కాశినాయన**

మండలంలోని ఓబులాపురం - జ్యోతి క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి అయిన మిద్దెల నుంచి ఓబులాపురం వరకు ఉన్న రోడ్డు ( దాదాపు పది కిలోమీటర్లు ) అధ్వానంగా మారింది. గుంతలమయంగా, అతుకులు గతుకులుగా మారి ప్రజల రాకపోకలు ఇబ్బందికంగా మారింది. ఏళ్ల తరబడి పరిస్థితి ఇలాగే ఉన్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి కానీ, అధికారి కానీ మరమ్మతులు చేయించిన పాపన పోలేదు. చిన్నపాటి వర్షానికి రోడ్డు మొత్తం వర్షపు నీటిఓ చెరువును, కుంటను తలపిసుంది. ఈ రహదారిపై వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వాహనదారులు రోడ్డు వల్ల నిత్యం అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించడమే కష్టతరంగా మారింది. ప్రజలు మోటారు బైకుల్లో, ఆటోలలో వెళ్లాలంటే ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయపడే పరిస్థితి ఏర్పడింది. ఓబుళాపురం-వరికుంట్ల వరకు ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరుపక్కలా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు అగుపడక ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలున్నాయి. ఈ ప్రధాన రహదారి వెంబడి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఏ ఒక్కరూ తమకు ఏమీ పట్టనట్లుగా, చూసీ చూడనట్లుగా వ్యవహ రిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, కూటమి, వైసిపికి చెందిన మంత్రులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, ఆయా పార్టీల ఇన్‌ఛార్జులు, మండల నాయ కులు ఎంతో మంది ఈ రహదారి వెంబడి జ్యోతి క్షేత్రానికి వెళ్లి వస్తూ ఉంటారు. ఏ ఒక్కరికీ కూడా రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న కంపచెట్లను తొలగించాలన్న ఆలోచన కానీ, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డును బాగు చేయాలనే ఉద్దేశం కానీ, ఉన్నట్టు కూడా అనిపించట్లేదు. రోజూ ప్రజలు తమ అవసరాల నిమిత్తం పట్టణాలకు వెళ్లి వస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లి రావాల్సిన పరిస్థితి. రోడ్డు మొత్తం గుంతలతో ఉండి చిన్నపాటి వర్షానికి కూడా రోడ్డు కనపడని పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారిలో గుంత ఎటుపక్క ఉందో, రోడ్డు ఎటుపక్క ఉందో తెలియక వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతూనే ప్రయాణిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఆంఅండ్‌బి అధికారులు విధులలో ఉన్నారా?, లేదా; అనే సందేహం ప్రజలకు ఏర్పడింది.

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఓట్ల కోసం నాయకులు ప్రజల వద్దకు వెళ్లి ' మీకు ఏ సమస్య ఉన్న చెప్పండి అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తాం' అని చెప్పి నాయకులు, గద్దెనెక్కిన తరువాత ప్రజల ఇబ్బందులను గాలికి వదిలేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు తమ సమస్యలు మరిచి పోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. అనేకసార్లు అనేక పత్రికల్లో కథనాలు వచ్చిన ఏ ఒక్క ప్రజాప్రతినిధి కానీ, అధికారులు కానీ స్పందించిన దాఖలాలు లేవు. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్లు సరిగా లేవని కూటమి నాయకులు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల ఫొటోలు తీసి పోస్టర్లు చూపిస్తూ హేళన చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నాయకులకు సమస్య కన్పించలేదా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏ పార్టీ గెలిచినా...ఏ ప్రభుత్వం ఏర్పడినా ప్రజలను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిన ఓబులాపురం - మిద్దెల ప్రధాన రహదారిని, రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న కంపచెట్లను అధికారులు,ప్రజా పాలకులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతుల చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఆస్పత్రి పాలయ్యాం..

రోడ్డు గుంత లమయంగా ఉండ టంవల్ల ఎంతో మందిమి బైక్‌లో వెళ్తూ కిండపడి గాయ పడ్డాం. ఎన్నో దెబ్బలు తగిలి ఆస్పతి పాలయ్యాం. అధి కారులకు, ప్రజా ప్రతిని ధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేయించాలని వేడుకుంటున్నాం.

**-శ్రీనివాసులు, గొంతువారిపల్లె,**

### రోడ్డు మరమ్మతులు చేయాలి..



రోడ్డుపై గుంతల పడటం వల్ల ఈ ప్రాంత రైతులమైన మేము ఎంతో ఇబ్బంది పడుతున్నాం. కనీసం పోరుమామిళ్లకి వెళ్లి మందులు తీసుకురావాలన్నా రోడ్డు దుస్థితిని చూసి వెళ్లలేకపోతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుమరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగిస్తారని ఆశిస్తున్నాం.

**- పబ్బతి లాజరస్, రైతు, నరసాపురం.**

## ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులకూ అమలు చేయాలి

**ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)**

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ సాయంతో నడుస్తున్న ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో కూడా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం వారు మైదుకూరులో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 39 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలున్నాయని, అందులో దాదాపు 8,714 మంది విద్యార్థులున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని వీరికి కూడా అమలు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు వెంకీ, నవీన్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న ఫొటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు

## వృద్ధులకు ఫొటోగ్రాఫర్ల అన్నదానం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అభివృద్ధికి లూయిస్ ఎంతో కృషి చేశారన్నారు. ఒక క్షణాన్ని మధురమైన జ్ఞాపకంగా మిగల్చగలిగేది, ఎన్నో భావాలను ఒక చిత్రంలో తెలిపే గొప్పతనం ఒక్క ఫొటోగ్రఫీకి మాత్రమే ఉందన్నారు. చిత్ర రూపాన్ని ఫొటోగ్రఫీగా మార్చి ఫొటోగ్రాఫర్లు సమాజంలో చైతన్యం తెస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ వీడియో గ్రాఫర్స్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు బదిలీ చేయాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామ పంచాయతీలకు బదిలీ చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 సెప్టెంబర్‌లో రూ.989 కోట్లు, 2024 డిసెంబర్‌లో రూ.1,121 కోట్లు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులు అందిన 10 రోజులలోపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు బదిలీ చేయాలి కాని, 10 నెలలు అవుతున్నా ఇంతవరకు గ్రామ పంచాయతీలకు బదిలీ చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించిందని ఆరోపించారు. పర్యవసానంగా గ్రామ పంచాయతీలు నిధులు లేక నీరసించి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రయివేట్ పాఠశాలల్లో చేరేందుకు నేడు ఆఖరు

**ప్రజాశక్తి - చక్రాయపేట**

ప్రయివేట్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం రోజని ఎంఇఒ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఒక్కరోజు మాత్రమే సమయం ఉన్నందున ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 20లోపు ఆన్‌లైన్ ద్వారా అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ కోరారు.

## ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

ఎస్‌టి కమిషన్ సెక్రటరీకి సమస్యలను వివరిస్తున్న కొండయ్య

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఉన్న ఎరుకుల కులాలలకు చెందిన పేదల సమస్యలను పరిష్కరించాలని ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నల్లబోతుల కొండయ్య ఎస్టీ కమిషన్ సెక్రటరీ రాం శేషుని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఎన్నో ఏళ్లుగా ఎరుకల కులాలకు చెందిన పేదలు నివసిస్తున్నారన్నారు. వీరికి కనీస వసతులు కూడా లేవన్నారు. ప్లాస్టిక్ పట్టలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలలో జీవిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ అవి రేషన్ బియ్యం పొందేందుకే పరిమితం అవుతున్నాయన్నారు. పెన్షన్, దీపం పథకం, తల్లికి వందనం, ఇళ్లు, రోడ్లు వంటి వాటికి నోచుకోలేకపోతున్నారన్నారు. తమ ఫెడరేషన్ సభ్యులు కాలనీలో పర్యటించి సమస్యలను గుర్తించారన్నారు. ఈ సమస్యలను సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పం దించారని, త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారని తెలిపారు.

## అర్హుల పింఛన్లు తొలగించడం అన్యాయం

**ప్రజాశక్తి - వేంపల్లె**

పునఃపరిశీలన పేరుతో అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్, ఎంపిటిసిల మణి గోపాల్‌రెడ్డి, భారతి, బాబా, పద్మా రాజ్‌కుమార్ పేర్కొన్నారు. తమ పింఛన్లు తొలగించడం అన్యాయమని బాధిత వికలాంగులు మంగళవారం ఎంపిటిసిలతో కలిసి ఎంపిడిఒ కుళాయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బూటకపు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వికలాంగులను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అట్టహాసంగా పింఛన్లు నగదు పెంచినట్లు చెప్పుకుంటూ మరో వైపు వికలాంగుల ఫించన్లు తొలగించారన్నారు. అర్హులైన వారి పింఛన్ తొలగించడం ఎంత వరకు న్యాయమని ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపిడిఒ గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లాలన్నారు. అర్హులకు ఫించన్లు మంజూరయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## పింఛన్ల పునరుద్ధరణకు అవకాశం

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ప్రభుత్వం వివిధ కారణాల వల్ల నిలిపేసిన వికలాంగ పింఛన్లు తిరిగి పునరుద్ధరించేందుకు అవకాశం కల్పించినట్లు ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 1నుండి వికలాంగ పింఛన్లు నిలిపేసినట్లు చెప్పారు. నిలిపేసిన పింఛన్లు తిరిగి పునరుద్ధరించుటకు ఎంపిడిఒ లాగిన్‌లో అవకాశం కల్పించినట్లు చెప్పారు. పింఛన్ పొందలేని లబ్ధిదారులు వారి అనర్హత నోటీసు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు ఎంపిడిఒకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో రీ అసెస్మెంట్ పంపనున్నట్లు తెలిపారు. అనంతరం సదరం క్యాంపునకు హాజరై పరీక్షలు చేయించుకున్న తర్వాత తిరిగి పింఛన్ పొందుటకు అర్హత పొందుతారని ఎంపిడిఒ వివరించారు.

## డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మండలంలోని రేకులకుంట పంచాయతీలో మంగళవారం సాయంత్రం పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఎర్రచందనం, సైబర్ క్రైమ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల ప్రభావం గురించి వివరించారు. యువత వీటి జోలికి పోకూడదని హెచ్చరించారు. సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని, ఏదైనా అనుమానాస్పద అంశం ఉంటే వెంటనే డయల్ 112 లేదా సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. బాల్యవివాహాల అనర్థాలు, సిసిటివిల ప్రాముఖ్యత, మూఢనమ్మకాలపై అవగాహన పాటల రూపంలో వినిపించారు. సైబర్ క్రైమ్స్‌పై నాటిక ప్రదర్శించి ప్రజల దృష్టిని ఆకర్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వర్షాలకు కాలనీలు అధ్వానం

### దోమలు, దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు - మురుగులోనే నడుస్తున్న వైనం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల వీధులు అధ్వానంగా మారాయి. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎమ్మెల్యే వీధి గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో కాలనీ వాసులు రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు రోజుల తరబడి నిలువ చేరి ఉండడం వల్ల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. పుల్లూరు దళితవాడలో వీధులు మరీ దారుణంగా ఉన్నాయి. మురుగునీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులో లేదు. వర్షాకాలం నేపథ్యంలో అంటూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా రసాయనాలను పిచికారీ చేయించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

గుంతలమయంగా ఎమ్మెల్యే కాలనీ వీధి

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

మైదుకూరు మున్సి పాలిటీ పరిధి 9వ వార్డులోని శ్రీనివాస్ నగర్‌లో డ్రెయినేజీ కాలువలు లేక వర్షపు నీరు అధికంగా రోడ్లపై నిలు స్తోంది. ప్రజలు మురుగు నీరులోనే నడవాల్సిన పరిస్థితి. సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అది ఇరువైపులా ఉన్న రోడ్డు కన్నా ఎక్కువ ఎత్తులో ఉండడంతో నీరు వచ్చి చేరుతోంది. కొన్నేళ్లుగా డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నప్పటికీ మున్సిపాలిటీ అధి.కారులు ఏమాత్రం స్పందించడం లేదు. వర్షం పడితే రోడ్డంతా జలమయం. వర్షం ఆగిన తర్వాత కూడా పది రోజులపాటు నీరు నిలువ చేరి, దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీనివాస నగర్‌లో రోడ్డుపై నిలిచిన నీటిలో నడుస్తున్న ప్రజలు

# స్పెషల్ గ్రాంట్ కోసం నివేదిక పంపాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లెలో రోడ్లుపై ఉన్న గుంతలను పూడ్చేందుకు స్పెషల్ గ్రాంట్ కింద నిధులు మంజూరు చేసేందుకు కలెక్టర్‌కు సభ్యుల తీర్మానం మేరకు నివేదిక పంపాలని అధికారులను జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ వైఎస్ఆర్ సభా భవన్‌లో మంగళవారం ఎంపిపి లక్ష్మిగాయత్రి ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ రోడ్లు సరిగాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుంతలను రోడ్డు భవ నాల శాఖ అధికారులు పూడ్చకపోతే రోడ్లపై ఉన్న గుంతల వద్ద ఎంపి టిసిలంతా నిరసన వ్యక్తం చేస్తామని ఎంపిటిసి కటిక చంద్రశేఖర్, భారతి, పద్మా రాజ్‌కుమార్, రవణమ్మ, మోహతాబ్, మణి గోపాల్‌రెడ్డి తెలిపారు. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించకుండా ఉండేందుకు పాత డ్రెయినేజీ కాలువల్లోకి అనుసంధానం చేయాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అధికారులను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గుంతలు పూడ్చేందుకు కృషి చేస్తానని ఎఇ మనోహర్‌రెడ్డి చెప్పారు. వ్యవసాయం శాఖ ద్వారా పరికరాలను రైతులకు పంపిణీ చేసినట్లు ఎఒ శివశంకర్‌రెడ్డి చెప్పారు. మండల వ్యాప్తంగా 540 మంది రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేశామన్నారు. కంది, మినుము విత్తనాలు ఇచ్చామన్నారు. అన్నదాత సుఖీభవ కింద మండల వ్యాప్తంగా 5,095 మంది రైతులకు త్వరలో వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. పట్టణ పరిధిలోని రైతులకు ఉచితంగా ఇచ్చే విత్తనాలు పంపిణీ చేయలేదని ఎంపిటిసి మణి గోపాల్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు ఇచ్చే సమయంలో ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం ఇవ్వాలని ఎంపిటిసిలు కోరారు. ప్రభుత్వం అందించే పథకాలపై సర్పంచులకు, ఎంపిటిసిలకు అధికారులు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 4,500 విద్యార్థులకు విద్యా మిత్రను అందించినట్లు ఎంఇఒ వెంకటరామిరెడ్డి చెప్పారు. పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని, రోగాలు బారిన ప్రజలు పడుతున్నట్లు ఎంపిటిసిలు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కళాశాల విశ్రాంతి సమయంలో పోకిరిలు ఎక్కువగా వస్తున్నారని, మహిళలు, బాలికలు ఇబ్బందులు పడుతున్నారని, పోలీసులు గస్తీ నిర్వహించాలని ఎంపిటిసి పద్మా జయలక్ష్మిదేవి కోరారు. ప్రతి రోజూ పాత బాలికల హైస్కూల్ వద్ద పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తామని ఎస్ఐ తిరుపాల్ నాయక్ హామీ ఇచ్చారు. పాపాఘ్ని నది నుండి వేంపల్లె ప్రజ లకు నీటిని అందించాలని ఎంపిటిసిలు అధికారులను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్ రే మిషన్ అందుబాటులోకి తేవాలని ఉప ఎంపిపి మెహ తాబ్ కోరారు. వేంపల్లె ఆసుపత్రికి మందుల కొరత చాలా ఉందని వైద్యులు వైద్యనాథ్ తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు రోగాల పాల వుతున్నారని తాళ్లపల్లె వైద్యాధికారి డాక్టర్ నిహారిక తెలిపారు. అర్హులైన విక లాంగుల ఫించన్లు తొలగించడం సరికాదని ఎంపిటిసిలు పేర్కొన్నారు. అర్హు లైన వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ వర్తింప జేయాలని ఎంపిపి లక్ష్మిగాయత్రి అధికారులను కోరారు. సమావేశంలో ఎంపిడిఒ కుళాయమ్మ, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, వైస్ ఎంపిపి రవణమ్మ, ఎంపిటిసిలు పంగా కల్యాణి, బ్రహ్మయ్య, సర్పం చులు, అధికారులు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపిటిసి భారతి

# ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు

**ప్రజాశక్తి - వేంపల్లె**

పిఆర్‌సి అమలు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న డిఎలు, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం వేంపల్లెలో జరిగిన యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ప్రభుత్వమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను, పిఆర్‌సిని వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీ ప్రగల్భాలు పలికి ఇప్పటికి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఓవైపు చెబుతూనే మరో వైపు రకరకాల యాప్‌లు, వివిధ శిక్షణలు, ఫార్మేటివ్ అసెస్మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులే పూరించాలని చెప్పడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయ బదిలీలు ముగిసినప్పటికీ రిలీవర్ లేక ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోవడంతో ఉపాధ్యాయుల్లో నిరాశ, ఆందోళన నెలకొందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకం తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చెయ్యాలనుకుంటే డియస్సీ ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితే తప్ప సాధ్యం కాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ చేసి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సివి రమణ, చెరుకూరి శ్రీనివాసులు, సిపిఎస్ జిల్లా కన్వీనర్ చిట్టిబోయిన సుదర్శన్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ తుమ్మల వెంకటరమణ పాల్గొన్నారు.

## మెస్‌ల నిర్వహణ అక్షయపాత్ర సంస్థకు ఇవ్వొద్దు

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో ఉన్న మెస్‌ల నిర్వహణ అక్షయపాత్ర సంస్థకు ఇవ్వవద్దని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. మంగళవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ అక్షయపాత్ర సంస్థ వల్ల కొన్ని వర్గాల విద్యార్థుల మనోభావాలు దెబ్బ తింటాయని తెలిపారు. మెస్ నిర్వహణ అక్షయపాత్రకు ఇచ్చే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని కోరారు. అక్షయపాత్రకు ఇవ్వడం వల్ల విద్యార్థులకు మంచి పోషకాహారం అందకపోవచ్చు అన్నారు. ప్రస్తుతం ఉన్న మెస్ నిర్వాహకులకే బాధ్యతలు పెంచి మరింత నాణ్యతగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఒంగోలు, నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లను సందర్శించి అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు కడప జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, కడప నగర అధ్యక్షుడు గురు మోహన్, రాఘవ, బాషా, కిరణ్ పాల్గొన్నారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- సిఐ రమణారెడ్డి**

**ప్రజాశక్తి - మైదుకూరు రూరల్**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ కె.రమణారెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. వర్షాకాలంలో తడి చేతులు, తడి దుస్తులతో కానీ విద్యుత్ స్విచ్‌లను తాకడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్‌ను వినియోగం చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొ న్నారు. అజాగ్రత్త వల్ల ప్రాణా పాయం సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తమతో పాటు తమ కుటుంబ సభ్యులను కూడా కాపాడు కోవచ్చన్నారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు.

## వర్షాలకు కూలిన మట్టి మిద్దె

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వలసపల్లె గ్రామంలో మంగళవారం మట్టి(చౌడ్) మిద్దె కూలిపోయింది. రామాలయం గుడి దగ్గర ఉన్న తాటిగొట్ల పుల్లారెడ్డి, తాటిగొట్ల పార్వతికి చెందిన మిద్దె ముందుగా కూలుతుందని గమనించి ఇంట్లో ఉన్నవారు బయటకి వెళ్లడంతో ప్రాణం నష్టం జరగలేదు. పుల్లారెడ్డి మాట్లా డుతూ స్థానిక ఐసిఎల్ పరిశ్ర మలో లోడింగ్ కార్మి కునిగా పనిచేస్తున్నానని తెలి పారు. ఇల్లు కూలడంతో సామాన్లు పాడయ్యాయని వాపోయాడు. విషయం వీఆర్వో రాజుకు తెలి పానని, ఆయన ఫొటోలు తీసు కుని వెళ్లారని వివరించారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ప్రభుత్వం ముస్లింలకు శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని హ్యూమన్ రైట్స్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు సర్దార్, షఫీర్ కోరారు. ఆ మేరకు వారు మంగళవారం తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామం రాజీవ్‌నగర్ కాలనీలో దాదాపు 250 ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. వారికి శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం మానవత దృక్పథంతో ఆలోచించి ముస్లింలకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 344/2024
వల్లం కొండు మల్లికార్జున S/o సుబ్బరాయుడు, లక్ష్మీ నగర్ ప్రొద్దుటూరు. ...వాది
V/s
పల్లె పోతుల సత్యనారాయణ శెట్టి, S/o శ్రీనివాసులు శెట్టి, Door No.18/339 రంగయ్య గారి సత్రం వీధి ప్రొద్దుటూరు, వైయస్సార్ కడప జిల్లా. ...ప్రతివాది
దావా సమను
పై దావలో తెలిపిన మొత్తము వాది తెలిపిన ప్రతివాది అయినా నీ వద్ద వసూలు చేసుకొనుటకు డిక్రీ కోరి పైకోర్టులో దావ దాఖలు చేసినాడు. నీకు అనేక మార్లు సమన్లు జారీ చేసినను తీసుకొనక తప్పించుకొని తిరగడము వలన 10.10.2025 పగలు 10:30 గంటలకు ఖుద్దున గాని వకీల్ ద్వారా గాని హాజరయ్యి ఆక్షేపణలు తెలుపుకోవయును. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎం. రామలింగేశ్వర రెడ్డి
వాది తరపు న్యాయవాది,
ప్రొద్దుటూరు

SWARUP EYE HOSPITAL & LASIK CENTRE, PRODDATUR. 08564-258182
PUBLIC NOTICE
మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (MCI) నీతి నియమావళి 2002 (పారా III లో ప్రచురించబడినది, గజిట్ ఆఫ్ ఇండియా యొక్క సెక్షన్ 4,6 ప్రకారం ఏప్రిల్ 2002 నాటిది) నోటిఫికేషన్ నెం. 211(2) 2001, Dt.11 మార్చి 2002 చాప్టర్ 1, 1.3.1 ప్రకారం స్వరూప్ ఐ హాస్పిటల్ & లాసిక్ సెంటర్ ప్రొద్దుటూరు ఆసుపత్రిలో జూలై 31, 2020 వరకు చికిత్స పొందిన వైద్య రికార్డులకు సంబంధించిన వివరములు శాశ్వతముగా తొలగింపు చేయుటకు నిర్ణయించడమైనది. కావున రోగి లేదా రోగి యొక్క చట్ట ప్రకారం వారసత్వపు సభ్యులు పైన తెలిపిన వైద్యమునకు సంబంధించిన రికార్డుల ప్రతులను (COPY) పొందగోరిన ఎడల వారు, రేపటి నుండి 15 దినములలో మా మెడికల్ రికార్డు విభాగం నందు తగు గుర్తింపు కార్డు (PROOF) తో సంప్రదించి పొందగలరు.

ఆర్‌డిఒ, డిఎస్‌పిని సన్మానిస్తున్న గండికోట చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

## ఆర్‌డిఒ, డిఎస్‌పికి ఘన సన్మానం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ఈ నెల 15న కలెక్టర్‌చే ప్రశంసాపత్రం అందుకున్న జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, డిఎస్‌పివెంకటేశ్వరావును మంగళవారం గండికోట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ అధికారులు ఇలాంటి ప్రశంసాపత్రాలు మరెన్నో స్వీకరించాలని ఆకాంక్షించారు. ఉన్నతస్థాయిలో ముందుకు సాగాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గండికోట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వై .చంద్రశేఖర్‌రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, బిషప్ సంతోష్ కుమార్, కోట చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వీరయ్య, వెంకటేశ్వర్లు, వి.మద్దిలేటి పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

**ప్రజాశక్తి - చక్రాయపేట**

భోజనాలను పరిశీలిస్తున్న రూతు ఆరోగ్య మేరీ

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని కెజిబివి డెవలప్‌మెంట్ అధికారి రూతు ఆరోగ్య మేరీ పేర్కొన్నారు. మండలంలోని కెజిబివి పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యబోధనపై, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి విద్యను అభ్యసించాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకొని చదవాలన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. కెజిబివి ప్రత్యేకాధికారి ఎస్ గౌస్ ప్యారీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఎఒ శివశంకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కుమ్మరాంపల్లె రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఎడబ్బుడిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేసే 62 మంది రైతులకు ఎన్ఎఫ్ఎ శ్రీకాంత్, ఎంటి ప్రతాప్ శిక్షణనిచ్చారు. ప్రకృతి వ్యవసాయ వరి రైతులు ఒక సెట్ పైపులను అందజేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు తగ్గి, పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని వివరించారు. వరి పంటలో అవసరానికి మించి నీటిని పెట్టడం వల్ల భూగర్భ జలాల నీటి శాతం పెరుగుతుందన్నారు. వేరు కుళ్లు 95 శాతం కనుమరుగు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో విఎఎలు సురేఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వరిలో కాలిబాటలు తప్పనిసరి

**ప్రజాశక్తి - చాపాడు**

వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎడిఎ కృష్ణమూర్తి సూచించారు. మండల పరిధిలోని నక్కలదిన్నె, అయ్యవారిపల్లె గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎడిఎ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో డివిజన్ పరిధిలో రైతులు అధికంగా వరి పంటను సాగు చేపడుతున్నారన్నారు. కాలిబాటలు ఏర్పాటు చేయడంతో గాలి, వెలుతురు బాగా సోకి, దోమలు వృద్ధి చెందవన్నారు. తద్వారా తెగుళ్లు తగ్గుతాయని ఆయన వివరించారు. యూరియాను అవసరం మేరకే ఉపయోగించాలన్నారు. ఈనెల చివరి వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా చెల్లించేందుకు అవకాశం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఇఒ స్వప్న, విఎఎలు అంజలి, లక్ష్మీప్రసన్న, మాస్టర్ ట్రైనర్ కృష్ణమూర్తి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహేష్, రైతులు పాల్గొన్నారు.

**ఎరువుల దుకాణాల్లో తనిఖీలు ..**

చాపాడులోని పురుగుమందులు, ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఎడిఎ కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి దేవి పద్మలత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ధరల వివరాలు, స్టాక్ సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు తెలిపారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి ఉన్న ఎరువులు, మందులు మాత్రమే విక్రయించాలన్నారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## జిరాక్స్ పత్రాలు ఉన్నా బస్సుల్లో అనుమతిస్తున్నాం

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

సూపరింటెండెంట్ విజయమ్మ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని మైదుకూరు ఆర్‌టిసి డిపో సూపరింటెండెంట్ విజయమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మహిళలు ఫొటో ధ్రువీకరణ పత్రాలను, జిరాక్స్ పత్రాలు ఉన్నప్పటికీ అనుమతిస్తున్నామన్నారు. మహిళలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. మూడు రోజుల్లో 16,200 మంది ఉచిత జీరో టికెట్ సద్వినియోగం చేసుకున్నారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల ఉచిత ప్రయాణానికి మైదుకూరు ఆర్‌టిసి డిపోలో 48 బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల కోసం రెండు బస్సులను అదనంగా నడుపుతున్నామన్నారు. మూడు రోజులకుగాను మహిళల రూ.10.98 లక్షలు లబ్ధి పొందారని ఆమె వివరించారు.

## ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్టు

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె పాపాఘ్ని నదిలో మంగళవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), ALLAGADDA
O. S. No.43/2022
Konka Venkata Seshudu ... Plaintiff
V/S
Konka Srinivasulu & Others ... Defendants
SUMMONS TO DEFENDANT NO.3
Palem Vara Lakshmi, W/o. Bala Ram Naidu, aged about 45 years, R/o. Pulivendula Town, Kadapa- District.
Whereas the Plaintiff has instituted a suit against you for partition and other consequential reliefs, you are hereby summoned to appear in this Court in person or by an advocate duly instructed and able to answer all meterial question relating to the case, on the **26 day of August 2025 at 10:30 A.M.**, to answer the claim.
Take notice that, in default of your appearance on the day mentioned above, the suit will be heard and determined in your absence.
By Order of the Court
**C. V. Ramana Rao,**
Advocate,
Reg. No. 767/2005,
Allagadda.